సాక్షి
అనకాపల్లి
బుధవారం, 31, మే, 2023



మృతదేహాలు లభ్యం 10లో

వెదురుపర్తి వద్ద శారదా నదిలో గల్లంతైన ఇద్దరు యువకుల మృతదేహాలు మంగళవారం లభ్యమయ్యాయి.



కలెక్టర్ సుడిగాలి పర్యటన

కె.కోటపాడు మండలం కొరువాడ గ్రామంలో మంగళవారం కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి సుడిగాలి పర్యటన చేశారు. 10లో

వాతావరణం

అనకాపల్లి టౌన్: రాగల అయిదు రోజులు ఆకాశం మేఘావృతమై ఉంటుందని ఆర్ఏఆర్ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త ఎంబీజీఎస్ కుమారి మంగళవారం తెలిపారు. ఉష్ణోగ్రతలు 36.4 నుంచి 35.1 డిగ్రీలు, గాలిలో తేమ శాతం 69 నుంచి 86, గాలి గంటకు 3 నుంచి 6 కిలోమీటర్ల వేగంతో వీస్తుందని పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

లలితాపీఠంలో కుర్తాళం పీఠాధిపతి



కుర్తాళం పీఠాధిపతి శ్రీసిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి

సీతంపేట: కుర్తాళం పీఠాధిపతి శ్రీసిద్ధేశ్వరానందభారతీ మహాస్వామి నాలుగు నెలల తర్వాత అక్కయ్యపాలెం లలితానగర్‌లోని లలితపీఠానికి విచ్చేశారు. శోభాకృత్ నామ సంవత్సరం ఆషాఢ పూర్ణిమ జూలై 3 తేదీ నుంచి భాద్రపద పూర్ణిమ సెప్టెంబరు 29 వరకు లలితాపీఠంలో 'చాతుర్మాస దీక్ష' జరుగుతుందని పీఠం మేనేజర్ మన్నవకృష్ణ సేన్ తెలిపారు. అప్పటి వరకు పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి లలితాపీఠంలో ఉంటారని తెలిపారు. స్వామివారిని కలవడానికి ముందుగా అనుమతి తీసుకోవాలని, దీని కోసం పీఠం మేనేజర్ 98492 86779ను సంప్రదించాలని తెలిపారు.

మూడో విడత చందనం అరగదీత ప్రారంభం



చందనాన్ని అరగదీస్తున్న సిబ్బంది

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో మంగళవారం నుంచి మూడో విడత చందనం అరగదీత శాస్త్రోక్తంగా ప్రారంభమైంది. వచ్చే నెల 4న జ్యేష్ఠ పౌర్ణమిని పురస్కరించుకుని స్వామికి సమర్పించే మూడు మణుగుల పచ్చి చందనాన్ని(120 కిలోలు) సమకూర్చేందుకు ఈ అరగదీతను ప్రారంభించారు. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం వరకు సిబ్బంది 34 కిలోల చందనాన్ని అరగదీశారు. ఇంకా 86 కిలోల చందనం అవసరం కాగా మరో మూడు రోజులపాటు అరగదీత జరగనుంది.

జపనీస్ లాంగ్వేజ్‌లో సర్టిఫికెట్ కోర్సుకు కృషి



వీసీ ప్రసాదరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న పీఎం బాలజీ, ఆచార్య జగన్నాథరావు

ఎంవీపీకాలనీ: ఆంధ్ర విశ్వవిద్యాలయం ద్వారా అందిస్తున్న జపనీస్ లాంగ్వేజ్ కోర్సును బలోపేతం చేయడంతో పాటు సర్టిఫికెట్ కోర్సును సైతం అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి తెలిపారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ మాజీ వీసీ ఆచార్య ఎం.జగన్నాథరావు సమక్షంలో జపాన్‌కు చెందిన తోషిబా కంపెనీ వైస్ ప్రెసిడెంట్ పీఎం బాలాజీ మంగళవారం ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డితో మర్యాద పూర్వకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వర్సిటీ అందిస్తున్న జపనీస్ లాంగ్వేజ్ కోర్సు బలోపేతం దిశగా చర్చలు జరిగాయి. జపనీస్ లాంగ్వేజ్ శిక్షణకు సర్టిఫికెట్ కోర్సు నిర్వహించే దిశగా సహకారం అందించాలని పీఎం బాలాజీని వీసీ కోరారు. వీసీ ప్రసాదరెడ్డి ప్రతిపాదనకు పీఎం బాలాజీ సమ్మతి తెలపడంతో పాటు అందుకు అవసరమైన ప్రణాళికకు కృషి చేస్తామని వెల్లడించారు.

రెండోరోజు పాలిసెట్ కౌన్సెలింగ్

అనకాపల్లి టౌన్: పాలిసెట్–2023 కౌన్సెలింగ్ రేబాక పాలిటెక్నిక్ కళాశాలలో కొనసాగుతోంది. రెండో రోజైన మంగళవారం 12,001 నుంచి 28 వేల ర్యాంక్ వరకు కౌన్సెలింగ్ నిర్వహించి, 108 మంది విద్యార్థులకు సీట్లు కేటాయించినట్టు కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసరావు చెప్పారు. బుధవారం 28,001 నుంచి 43 వేలు వేల ర్యాంక్ వరకు నిర్వహిస్తామన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కౌన్సెలింగ్ జరుగుతుందని పేర్కొన్నారు.

రైల్వే సీనియర్ క్లర్క్ డిస్మిస్

తాటిచెట్లపాలెం: రైల్వేలో వాల్తేరు డివిజన్ పరిధి లక్ష్మీపూర్ రోడ్డు స్టేషన్‌లో సీనియర్ క్లర్క్‌గా విధులు నిర్వహిస్తున్న సంపత్తి రామచంద్రరావును విధులు నుంచి తొలగించినట్టు రైల్వే మేనేజర్ అనూప్‌కుమార్ సత్పతి మంగళవారం తెలిపారు. 1997లో కలాసీగా విధుల్లో చేరిన రామచంద్రరావు సీనియర్ క్లర్క్‌గా ఎదిగారన్నారు. రైల్వే అధికారులపై తప్పుడు కేసులు పెట్టడం, సిబ్బందిని తప్పుతోవ పట్టించడం, అధికారులను బ్లాక్ మెయిల్ చేస్తూ ఉండేవాడన్నారు. అవన్నీ రుజువు కావడంతో ఆయనను విధులు నుంచి తొలగించామన్నారు.

నాలుగేళ్లు.. ఆనందం పరవళ్లు

- గ్రామగ్రామాన సంబరాలు చేసుకున్న ప్రజలు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు
- సేవా కార్యక్రమాలు, మిఠాయిల పంపిణీతో నీరాజనాలు
- మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డే సీఎం కావాలని నినాదాలు



రావికమతం మండలం గర్నికం గ్రామంలో పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న ఎంపీ డాక్టర్ సత్యవతి, ప్రభుత్వ విప్ ధర్మశ్రీ



డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడుకు కేక్ తినిపిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

సాక్షి నెట్‌వర్క్ : నారాసుర పాలన అంతమై, జగదానంద కారకమైన ప్రజా ప్రభుత్వం ఏర్పడి నాలుగేళ్లయిన సందర్భంగా జిల్లా అంతటా సంబరాలు జరిగాయి. సుదీర్ఘ పాదయాత్రలో జనం బాధలు గమనించి, అవి తొలగేలా పథకాలు ప్రకటించి, అధికారంలోకి వచ్చాక అమలు చేసిన ప్రియతమ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు సువర్ణ పాలన అందిస్తున్నారు. మేనిఫెస్టోలోని దాదాపు అన్ని హామీలను అమలు పరచి, సమయానుకూలంగా మరిన్ని పథకాలు జత చేసి రామరాజ్యాన్ని కళ్ల ముందు నిలిపారు. గాంధీజీ కలలు గన్న గ్రామ స్వరాజ్యాన్ని అందుబాటులోకి తెచ్చారు. గ్రామ సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థతో అవినీతి లేని పాలన అందించారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా సాగుతున్న జగనన్న పాలనకు నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా ప్రజలు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పండగ చేసుకున్నారు. సేవా కార్యక్రమాలతో, కేక్ కటింగ్‌లతో వేడుక చేసుకున్నారు. మిఠాయిలు పంచుకొని నీరాజనాలు పలికారు.

- డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు మాడుగులలో భారీ కేక్ కట్ చేసి అభిమానులకు అందజేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు జై జగన్, జై బూడి అంటూ సంబరాలు చేసుకున్నారు. ఎంపీపీ వేమవరపు రామధర్మజ, వైస్ ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్, సర్పంచ్ ఎడ్ల కళావతి, జెడ్పీటీసీ కిముడు రమణమ్మ పాల్గొన్నారు.
- రావికమతం మండలం గర్నికం గ్రామంలో ప్రభుత్వ విప్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కరణం ధర్మశ్రీ, ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతితో కలిసి కేక్ కట్ చేశారు. పేదలకు వస్త్రాలు పంపిణీ చేశారు. నాలుగేళ్ల సంక్షేమ పాలనలో రాష్ట్రం అన్నింటా అభివృద్ధి పథంలో నిలిచిందని, వేరే రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందని ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎంపీ సత్యవతి అన్నారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాం దేశానికే ఆదర్శనీయమని తాను ఒక డాక్టర్‌గా అనుభవంతో చెబుతున్నానన్నారు. ధర్మశ్రీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తండ్రిని మించిన తనయుడిగా నిలిచారన్నారు. గత ప్రభుత్వం రూ.2 లక్షల 60 వేల కోట్ల అప్పులతో రాష్ట్రాన్ని అప్పగించినా ప్రజా సంక్షేమానికి భంగం కలగకుండా పరిపాలిస్తున్నారన్నారు.
- నాతవరంలోని పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర గణేష్ పార్టీ శ్రేణులు మధ్య కేక్ కట్ చేసి సందడి చేశారు. రూ.470 కోట్లతో చేపట్టిన ఏలేరు–తాండవ అనుసంధానం చరిత్రలో నిలిచిపోతుందన్నారు. మాకవరపాలెం మండలంలో 500 కోట్లతో మెడికల్ కాలేజీ నిర్మిస్తున్నారని చెప్పారు.
- అడ్డురోడ్డు జంక్షన్‌లో ఎమ్మెల్యే గొల్ల బాబూరావు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. మాటల ప్రభుత్వ కాదిది చేతల ప్రభుత్వం అని జగన్‌మోహన్‌రెడ్డి నిరూపించారని బాబూరావు కొనియాడారు. ఈ సందర్భంగా వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సమీపంలో ఏర్పాటు చేసిన వేదిక వద్ద మహిళలతో సీఎం చిత్రపటానికి పాలభిషేకం చేశారు.
- యలమంచిలి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార్‌వర్మలతో కలిసి ఎమ్మెల్యే కన్నబాబురాజు భారీ కేక్ కట్ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో కోట్లాది రూపాయలు వెచ్చించి ఆస్పత్రుల నిర్మాణం చేపట్టామని, చెరువుల్లో పూడిక తీయించి జలకళ ఉట్టిపడే విధంగా సుందరంగా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు.
- అనకాపల్లిలో పార్టీ పట్టణ కార్యాలయంలో పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్ ఆధ్వర్యంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్ కేక్ కట్ చేసి సంబరాలు చేశారు.

దేశ చరిత్రలో సువర్ణాక్షరాలతో..

- సంక్షేమ సారథి వైఎస్ జగన్
- ఆయన ఆశయాలు అందరికీ ఆదర్శం
- డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు

మాడుగుల: తన సుదీర్ఘ పాదయాత్రలో ప్రజల కష్టాలను చూసి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలు నవరత్నాలయ్యాయి.. ముఖ్యమంత్రిగా ఆయన అందిస్తున్న పాలన చరిత్రలో నిలిచిపోతుంది అని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా మాడుగులలో మంగళవారం రాత్రి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సంక్షేమ కేలండర్ విడుదల చేసి కరోనా కష్టకాలంలో కూడా అనుకున్న ప్రకారం అమలు చేసిన ఆదర్శమూర్తి మన జగనన్న అని కొనియాడారు. మళ్లీ సీఎంగా జగనే రావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు.
పాఠశాలలు, ఆస్పత్రుల రూపురేఖలు మార్చారని, వలంటీర్ వ్యవస్థ ఏర్పాటు చేసి ప్రతి ఇంటి తలుపు తట్టి పథకాలు అందజేయడం దేశ చరిత్రలో ఎక్కడా లేదన్నారు. అందరికీ ఇల్లు పథకంలో 30 లక్షల ఇళ్ల పట్టాలతోపాటు ఇళ్లు అందజేశారన్నారు. చంద్రబాబు గారిడీ మాటలతో రాష్ట్ర ప్రజలను మరోసారి బురిడీ కొట్టించాలని చూస్తే ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు.

నేవల్ ఆఫీసర్ ఇన్‌చార్జ్‌గా రజినీష్ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న కమడోర్ రజనీష్ శర్మ

దొండపర్తి: నేవల్ ఆఫీసర్ ఇన్‌చార్జ్ (ఆంధ్రప్రదేశ్)గా కమడోర్ రజనీష్ శర్మ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. నేవల్ బేస్‌లో ఇప్పటివరకు ఆ స్థానంలో విధులు నిర్వర్తించిన కమడోర్ ఎం.గోవర్ధన్‌రాజు నుంచి బాధ్యతలు తీసుకున్నారు. రజనీష్ శర్మ 1997, జూలై 1న నావికాదళంలో చేరారు. నావిగేషన్, డైరెక్షన్‌లో నిపుణుడిగా గుర్తింపు పొందారు. ఐఎన్ఎస్ శివాలిక్‌లో ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గాను, ఐఎన్ఎస్ అక్షయ్, ఫ్లీట్ సపోర్ట్ నౌక దీపక్‌కు కమాండర్‌గా వ్యవహరించారు. డిప్యూటేషన్‌పై మారిషస్ నేషనల్ కోస్ట్‌గార్డ్ అధికారిగా విధులు నిర్వర్తించారు.

పథకం ప్రకారమే ప్రాణం తీశాడు

- విడిపోయినా భార్యకు వేధింపులు
- నెల రోజులుగా మంచివాడిగా నటన
- లాడ్జికి రప్పించి దారుణ హత్య

సాక్షి, అనకాపల్లి/అచ్యుతాపురం: ఇంటర్ నుంచి ప్రేమించాడు. పెద్దల్ని ఎదిరించి పెళ్లి చేసుకున్నాడు. చివరకు పెద్దలు కూడా ఆదరించడంతో హాయిగా కాపురం చేసుకోవలసిన స్థితిలో భార్యతో విభేదాలు వచ్చాయి. విడిపోవాలని నిర్ణయించుకున్న తర్వాత కూడా ఆమెను విడిచిపెట్టలేదు. వెంటపడి వేధించడంతో పోలీసుల వరకు వ్యవహారం వెళ్లింది. ఫిర్యాదు చేసిందని కోపం పెంచుకున్నాడు. కక్ష కట్టి హత్యకు ఒడిగట్టాడు. సంఘటన స్థలంలో కనిపించిన దృశ్యాలు, పోలీసుల దర్యాప్తులో తెలిసిన విషయాల వల్ల దాదాపు ఇదే విషయం నిర్ధారణ అవుతోంది. అచ్యుతాపురంలో సోమవారం జరిగిన మహిళ అనుమానాస్పద మృతి హత్యగానే పోలీసులు భావిస్తున్నారు. భార్య మహాలక్ష్మిని హతమార్చిన శ్రీనివాస్ ఇంకా అపస్మారక స్థితిలో ఉండడంతో పూర్తి వివరాలు వెల్లడి కాలేదు.

ఇంటర్ నుంచే పరిచయం

ఇన్వెస్టిగేషన్ అధికారి, పరవాడ డీఎస్పీ కె.వి.వి సత్యనారాయణ చెప్పిన వివరాల ప్రకారం... అగనంపూడికి చెందిన మహాలక్ష్మి, గాజువాక బీసీ సెంటర్‌కు చెందిన శ్రీనివాస్‌లు ఇద్దరూ ఇంటర్ నుంచే క్లాస్‌మేట్స్. వీరి స్నేహం ప్రేమగా మారింది. పెద్దలను ఎదురించి పెళ్లి చేసుకున్నారు. వివాహమైన ఏడాదిలోనే వీరిద్దరి మధ్య విభేదాలు ఏర్పడ్డాయి. ఈ విభేదాలు కాస్త విడాకుల వరకూ దారితీశాయి. చివరికీ ఇద్దరూ మ్యూచువల్ డైవోర్స్‌కి సిద్ధపడ్డారు. 2021లో విడాకులకు దరఖాస్తు చేసుకున్నారు. అయితే శ్రీనివాస్ కోర్టుకు సక్రమంగా హజరయ్యేవాడు కాదు. దీంతో విడాకుల ప్రక్రియ ఆలస్యమైంది. అగనంపూడి నుంచి రాంబిల్లికి రోజూ బస్సులో ఉద్యోగానికి వెళుతున్న మహాలక్ష్మి సంతోషంగా ఉండడం ఇష్టం లేని శ్రీనివాస్ మద్యానికి బానిసయ్యాడు. ఏ ఉద్యోగం లేకుండా జులాయిగా తిరిగే ఉన్మాదిలా మారాడు. మహాలక్ష్మిని వేధించడం మొదలపెట్టాడు. దీంతో ఆమె తల్లిదండ్రులు గాజువాక పోలీసులకు ఫిర్యాదు చేయడం..వారు కౌన్సెలింగ్ ఇవ్వడం జరిగింది. దీంతో మహాలక్ష్మిపై పగ పెంచుకున్నాడు. ఎలా అయినా హతమార్చాలని అనుకున్నాడు.





మహాలక్ష్మి (ఫైల్), శ్రీనివాస్ (ఫైల్)

మహాలక్ష్మి ఒంటిపై 20 కత్తి గాట్లు

నెల రోజుల నుంచి శ్రీనివాస్ మంచివాడిగా మారినట్లు నటించాడు. ఆ అమ్మాయికి తనపై సానుభూతి కల్గించేలా చేశాడు. పథకం ప్రకారమే సోమవారం ఉదయం 10.30 గంటలకు అచ్యుతాపురంలోని లాడ్జిలో తన పేరు మీద రూం బుక్ చేసుకున్నాడు. తనతోపాటు బిర్యానీ, మత్తు ఇంజక్షన్‌లు, కత్తి కూడా తీసుకుని వచ్చాడు. లాడ్జి నుంచే మహాలక్ష్మికి ఫోన్ చేశాడు. రమ్మని ప్రాధేయపడ్డాడు. దీంతో ఉదయం 11 గంటలకు ఆమె లాడ్జికి వచ్చింది. ఆ తర్వాతే దారుణం జరిగింది. మహాలక్ష్మి శరీరంపై 20 వరకు కత్తి గాట్లు ఉన్నట్టు వైద్యులు చెబుతున్నారు.

ఇంకా అపస్మారక స్థితిలోనే ఉన్న శ్రీనివాస్..

మత్తు ఇంజక్షన్‌లు తీసుకోవడంతో మంగళవారం కూడా శ్రీనివాస్ అపస్మారక స్థితిలోనే ఉన్నాడు. అనకాపల్లిలో చికిత్స పొందుతున్నాడు.

మహాలక్ష్మి బంధువుల ఆందోళన



శ్రీనివాస్‌పై చర్యలు తీసుకోవాలని కేజీహెచ్‌లో ఆందోళన చేస్తున్న మహాలక్ష్మి బంధువులు

మహారాణిపేట (విశాఖ): మహాలక్ష్మి బంధువులు మంగళవారం కేజీహెచ్‌లో ఆందోళన చేశారు. మహాలక్ష్మి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కేజీహెచ్‌కు తరలించారు. మహాలక్ష్మిని చంపిన భర్త శ్రీనివాస్‌పై కేసు నమోదు చేయాలని, కఠినంగా శిక్షించాలని మార్చురీ వద్ద బంధువులు నినాదాలు చేశారు. కేసు నమోదు చేస్తామని పోలీసులు హామీ ఇవ్వడంతో పోస్టుమార్టం నిర్వహించేందుకు బంధువులు అంగీకరించారు.

గోదావరి జలాలతో ఉత్తరాంధ్ర సుభిక్షం

'బాబూ జగ్జీవన్ రామ్ ఉత్తరాంధ్ర సుజల స్రవంతి' ప్రాజెక్టుతో ఉత్తరాంధ్ర సుభిక్షం కానుంది. వెనకబడిన ప్రాంతమైన ఉత్తరాంధ్రకు 8 లక్షల ఎకరాలకు సాగునీరు, 30 లక్షల మందికి తాగునీరు అందించడమే కాకుండా.. పారిశ్రామిక అవసరాలను తీర్చడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందడుగు వేస్తోంది. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి రెండో దశ భూసేకరణ ప్రక్రియ పనులు శరవేగంగా సాగుతున్నాయి. పోలవరం ఎడమ కాలువ ద్వారా ఈ ప్రాజెక్టుతో ఉత్తరాంధ్ర జిల్లాలకు సాగు నీరందించి తద్వారా ఆయకట్టును సస్యశ్యామలం చేయాలన్నది అప్పటి ముఖ్యమంత్రి వైఎస్సార్ ఆలోచన. అయితే దురదృష్టవశాత్తు మహానేత మరణంతో ఈ ప్రాజెక్ట్ కుంటుపడింది. ఆ తర్వాత వచ్చిన పాలకులు దీన్ని పూర్తిగా నిర్వీర్యం చేశారు. దీంతో ఈ ప్రాజెక్టు నిర్మాణ పనుల్లో జాప్యం జరిగింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ఉత్తరాంధ్ర సుజల స్రవంతిపై ప్రత్యేక దృష్టి సారించారు.



పిసినికాడలో భూసేకరణకు సర్వే చేస్తున్న సిబ్బంది



పిసినికాడలో కాలువ నిర్మించే ప్రాంతం

- ఐదు జిల్లాల్లో 8 లక్షల ఎకరాలకు సాగు, తాగునీరు
- పారిశ్రామిక అవసరాలనూ తీర్చనున్న ప్రాజెక్టు
- ఉత్తరాంధ్ర సుజల స్రవంతి రెండో దశ భూసేకరణ వేగవంతం
- అనకాపల్లి రెవెన్యూ డివిజన్ పరిధిలో 2,600 ఎకరాలు
- గ్రామ సభల ద్వారా 20 గ్రామాల్లో సర్వే ప్రక్రియను పూర్తి
- 2024 మే నాటికి జిల్లాలో భూసేకరణ ప్రక్రియ పూర్తే లక్ష్యం

సాక్షి, అనకాపల్లి : ఉత్తరాంధ్రను గోదావరి జలాలతో అభిషేకించి సుభిక్షం చేసేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నడుం బిగించింది. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకాన్ని పూర్తి స్థాయిలో చేపట్టాలని నిర్ణయించింది. ఇందుకు సంబంధించి రూ.17,050.20 కోట్లతో ఏడాది క్రితమే రాష్ట్ర ప్రభుత్వం పరిపాలన అనుమతి కల్పించింది. ఇందులో తొలిదశ పనుల అంచనా వ్యయం రూ.2,022.20 కోట్లు కాగా రెండో దశ పనుల అంచనా వ్యయం రూ.15,028 కోట్లుగా నిర్ణయించారు. ఈ ప్రాజెక్ట్ పూర్తయితే అనకాపల్లి, విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాలకు మహర్దశ పడుతుంది. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకం తొలి, రెండో దశలో 63.99 కి.మీ. పొడవున ప్రధాన కాలువ, 3.98 లక్షల ఎకరాలకు నీళ్లందించేలా డిస్ట్రిబ్యూటరీల పనులను ప్రభుత్వం ఇప్పటికే చేపట్టింది. ప్రధాన కాలువలో మిగిలిన పనులతోపాటు భూదేవి (అనకాపల్లి జిల్లా), వీరనారాయణపురం (విజయనగరం జిల్లా), తాటిపూడి (విజయనగరం జిల్లా) రిజర్వాయర్ల నిర్మాణ పనులకు టెండర్లు పిలిచేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. వేగంగా పూర్తి చేసేలా అత్యంత ప్రాధాన్యత ప్రాజెక్టుగా ఉత్తరాంధ్ర సుజల స్రవంతిని ప్రభుత్వం చేపట్టింది. ఒకవైపు భూసేకరణ ప్రక్రియను కొనసాగిస్తూనే.. మరోవైపు పనులు చేపట్టడం ద్వారా వేగంగా ప్రాజెక్టును పూర్తి చేసి ఉత్తరాంధ్రను సస్యశ్యామలం చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యం. మొదటి, రెండు దశల్లో మిగిలి ఉన్న భూసేకరణ, సర్వే పనులు పూర్తిచేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు వెళుతోంది. మొదటి ప్యాకేజీలో కొంత భాగం డ్రాఫ్ట్ డిక్లరేషన్ దశలో ఉంది. సర్వే, దర్యాప్తు పనులు పూర్తయ్యాయి. డిజైన్ అనుమతులు పురోగతిలో ఉన్నాయి. రెండవ ప్యాకేజీ ప్రాథమిక నోటిఫికేషన్ దశలో ఉంది.

మిగిలిన పనులు వేగవంతం

ఉత్తరాంధ్ర సుజల స్రవంతి రెండో దశలో మిగిలిన పనులకు భూసేకరణ ప్రక్రియ వేగంగా సాగుతోంది. అనకాపల్లి జిల్లాలో 1900 ఎకరాల జిరాయితీ భూమి, 700 ఎకరాల ప్రభుత్వ, అసైన్డ్, గెడ్డ భూములు మొత్తం 2,600 ఎకరాలు అందుబాటులో ఉన్నాయి. వీటి కోసం ఇప్పటికే కశింకోట, సబ్బవరం, అనకాపల్లి రెవెన్యూల పరిధిలో 22 గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించారు. 20 గ్రామాల్లో సర్వే ప్రక్రియను పూర్తి చేశారు. ప్రభుత్వం విడుదల చేసిన జీవో ప్రకారం.. రైతులకు అదనపు పరిహారం కూడా అందించనున్నారు. అంతేకాకుండా స్థలంలో చెట్లకు కూడా తగు పరిహారం అందించి ప్రభుత్వం రైతుకు అండగా నిలుస్తోంది.

ఉత్తరాంధ్ర సుజల స్రవంతి హైలైట్స్

- దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పోలవరం నుంచి రోజుకు 17,561 క్యూసెక్కులు (1.51 టీఎంసీలు) తరలించేలా పోలవరం ఎడమ కాలువను చేపట్టారు.
- పోలవరం ఎడమ కాలువ కింద 4 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీళ్లందిస్తూనే 162.409 కి.మీ. నుంచి రోజుకు ఎనిమిది వేల క్యూసెక్కులను తరలించేలా డిజైన్ చేశారు.
- ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకానికి 2009 జనవరి 2న శంకుస్థాపన చేశారు.
- వైఎస్సార్ హఠాన్మరణంతో పనులకు గ్రహణం పట్టింది. ఆ తరువాత వచ్చిన పాలకులు చంద్రబాబుతో సహా ఎవరూ దీన్ని పట్టించుకోలేదు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టాక ఉత్తరాంధ్ర సుజల స్రవంతిని ప్రాధాన్యత ప్రాజెక్టుగా చేపట్టారు.

వచ్చే ఏడాది మే నెలకు భూసేకరణ పూర్తి



అనకాపల్లి జిల్లాలో మూడు రెవెన్యూ మండల పరిధిలో భూసేకరణకు సర్వే ప్రక్రియ చేపడుతున్నాం. ఇప్పటికే అనకాపల్లి రెవెన్యూ పరిధిలో 10 గ్రామాలు, సబ్బవరం రెవెన్యూ పరిధిలో 9 గ్రామాలు, కశింకోట రెవెన్యూ పరిధిలో 3 గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించాం. రైతులు ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టుకు భూములు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారు. వారికి చక్కని పరిహారం అందించాలని ప్రతిపాదనలు పంపించాం. అదనంగా అటవీశాఖ అధికారులు నిర్ణయించిన విధంగా చెట్లకు కూడా విలువ కట్టి రైతుకు అదనపు పరిహారం అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఈ భూసేకరణ ప్రక్రియ అంతా వచ్చే ఏడాది మే నెల నాటికి పూర్తి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం.

–కె.రమామణి, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్

భూసేకరణకు మేం సిద్ధమే



ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు కోసం ఎలాంటి సహకారమైనా అందిస్తాం. మా గ్రామంలో గ్రామ సభను ఏర్పాటుచేసి పరిహారం రెండున్నరెట్లు ఇస్తామని అధికారులు చెప్పారు. మాది ఐదున్నర ఎకరాల జిరాయితీ భూమి పోతోంది. 400 ఏళ్ల క్రితం నుంచి సాగులో ఉన్నాం. మా భూమి ఇవ్వడానికి సిద్ధంగానే ఉన్నాం.

– డి.కళ్యాణ్ చక్రవర్తి, రైతు, తుమ్మపాల

క్లుప్తంగా

ఇరువర్గాలపై కొట్లాట కేసు నమోదు

యలమంచిలి : మండలంలో రేగుపాలెం గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులపై కోట్లాట కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ కె. సన్నిబాబు తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం రేగుపాలెం గ్రామానికి చెందిన రెడ్డి రమణ అనే వ్యక్తి జగనన్న కాలనీలో అవకతవకలు జరిగాయని స్పందనలో ఫిర్యాదు చేశారు. దీనిపై అధికారుల బృందం ఆదివారం రేగుపాలెం జగనన్న కాలనీని సందర్శించి విచారణ చేస్తుండగా ఆ సమయంలో ఇదే గ్రామానికి చెందిన షేక్ యాసీన్‌బాబు, రెడ్డి రమణ గొడవపడ్డారని ఎస్ఐ సన్నిబాబు తెలిపారు. ఇరువర్గాల దాడిలో ఇద్దరికి గాయాలయ్యాయని, ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

దిబ్బపాలెంలో క్షుద్రపూజల కలకలం

అచ్యుతాపురం (అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని దిబ్బపాలెంలో క్షుద్రపూజలు కలకలం రేపాయి. సోమవారం అర్ధరాత్రి స్థానిక సర్పంచ్ కుమారి ఇంటి ముందు ఎవరో ముగ్గులు, ఎముకలు, నిమ్మకాయలు, కోడిగుడ్లు వేశారు. ఉదయం లేచిన తర్వాత చూసిన వారు భయభ్రాంతులకు గురయ్యారు. తమకు గిట్టని స్థానికులే ఈ క్షుద్రపూజలు చేశారంటూ సర్పంచ్ కుటుంబీలకు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కొత్త జిల్లాల్లో దివ్యాంగుల సంక్షేమ కార్యాలయాలు



మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

సీతమ్మధార: కొత్తగా ఏర్పాటైన జిల్లాల్లో దివ్యాంగ సంక్షేమ కార్యాలయాలు ఏర్పాటు చేయాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా దివ్యాంగులకు రూ.3వేల నుంచి రూ.6 వేలకు పింఛన్ పెంచాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం పార్కులో మంగళవారం జరిగిన ధర్నాలో ఆయన మాట్లాడారు. శారీరక దివ్యాంగులకు రోస్టర్ పాయింట్ టాప్‌టెన్‌లో పెట్టాలన్నారు. దివ్యాంగులకు 4 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, తొలగించిన వారికి తిరిగి పింఛన్లు పునరుద్ధరించాలన్నారు. ప్రతీ దివ్యాంగుడికి అంత్యోదయ కార్డు మంజూరు చేయాలని, ఇంటి స్థలం కేటాయించాలని డిమాండ్ చేశారు. రూ.లక్ష నుంచి రూ.10లక్షల వరకు రుణ సదుపాయం కల్పించాలని కోరారు. సమితి రాష్ట్ర అధ్యక్షుడు చిన్న సుబ్బయ్య యాదవ్, ఎం.రమేష్‌బాబు, వై.డేవిడ్ రాజు, విశాఖ జిల్లా అధ్యక్షుడు జి.రాము, వి.సుందరరావు, ఎస్.మల్లేశ్వరి, ఉపాధ్యక్షులు దివిరి శ్రీనివాసులు, జె.నాగమణి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో భారీగా చేరికలు

- డిప్యూటీ సీఎం బూడి సమక్షంలో పార్టీలో చేరిన 70 మంది టీడీపీ కార్యకర్తలు



వైఎస్సార్‌సీపీలో చేరిన దేశం కార్యకర్తలతో డిప్యూటీ సీఎం బూడి, స్థానిక నాయకులు

మాడుగుల రూరల్: మండలంలో కేజేపురం గ్రామానికి చెందిన 70 మంది టీడీపీ కార్యకర్తలు డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సమక్షంలో మంగళవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. గ్రామ శివారు తెలకలదీపం వద్ద జరిగిన కార్యక్రమంలో డిప్యూటీ సీఎం వైసీపీ కండువాలు వేసి వరిని పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు మెచ్చి ఇతర పార్టీల నుంచి నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు వైసీపీలో చేరడంపై హర్షం వ్యక్తం చేశారు.

సమష్టిగా వుంటే గ్రామాన్ని మరింత అభివృద్ధి చేయడానికి వీలు పడుతుందని నూతనంగా చేరిన కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ జామి రమణబాబు, మండల పార్టీ ఉపాధ్యక్షుడు కాళ్ల అప్పలనాయుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు కాళ్ల రాము, పార్టీ నాయకులు ఆడారి కన్నారావు, మళ్ల కన్నబాబు, యల్లపు శ్రీను, భీశెట్టి జగ్గప్పారావు, మద్దాల వెంకట సత్యనారాయణ, కాళ్ల జగన్, అచ్చిమినాయుడు, మాలినాయుడు, శంకర్రావు తదితర్లు పాల్గొన్నారు.

కొరువాడలో కలెక్టర్ సుడిగాలి పర్యటన

- జగనన్న లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాల పరిశీలన
- ప్రభుత్వ భవనాల నిర్మాణ ప్రగతిపై ఆరా



కొరువాడలో పర్యటిస్తున్న జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి



సచివాలయం నిర్మాణాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

కె.కోటపాడు : జగనన్న ఇళ్ల లేఅవుట్లలో జూన్ నెలాఖరులోగా ఇంటి నిర్మాణాలను పూర్తి చేసేలా అధికారులు పర్యవేక్షించాలని అనకాపల్లి జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి అన్నారు. కొరువాడ గ్రామంలో మంగళవారం ఆయన సుడిగాలి పర్యటన చేశారు. జగనన్న లేఅవుట్‌ను సందర్శించారు. లేఅవుట్‌లో 171 మందికి ఇంటి పట్టాలతో పాటు ఇంటి నిర్మాణ అనుమతులను 10 గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు ఇచ్చినట్టు హౌసింగ్ ఏఈ బి.రవిబాబు ఆయనకు తెలిపారు. లేఅవుట్‌లో నిర్మాణాలు స్లాబ్ దశను ఎక్కువగా పూర్తి చేసుకోవడంతో పాటు పలువురు లబ్ధిదారులు గృహప్రవేశాలు జరపడంతో జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి సంతృప్తి వ్యక్తం చేశారు. ఇటీవల గృహప్రవేశాన్ని పూర్తి చేసుకున్న చీపురపల్లి ఎరుకులమ్మ ఇంటికి వెళ్లి ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం అందించిన ఆర్థిక సహాయం పూర్తిగా అందిందా అని ఆమెను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణాలను పూర్తి చేసుకున్న ఇళ్లకు విద్యుత్ కనెక్షన్‌ను ఉచితంగా ఇస్తున్నట్టు కలెక్టర్ తెలిపారు. కె.కోటపాడు మండలంలో 29 లేఅవుట్లలో విద్యుత్, తాగునీటి సదుపాయాల కల్పనపై విషయమై విద్యుత్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు చంద్రశేఖర్, ఎ.శ్వేతను అడిగి తెలుసుకున్నారు. జల్‌జీవన్ మిషన్ పనుల్లో భాగంగా మండలంలో గల 15,800 ఇళ్లకు గాను ప్రస్తుతానికి 11వేల ఇళ్లకు ఇంటింటి కుళాయిలు ఏర్పాటు చేసినట్టు కలెక్టర్‌కు వివరించారు. అనంతరం గ్రామంలో సచివాలయం, వెల్‌నెస్, ఆర్బీకే భవన నిర్మాణాలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా ప్రభుత్వం మంజూరు చేస్తున్న అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయించాలని మండల ఇంజినీర్ బాలాజీ అప్పారావుకు తెలిపారు. ఆరోగ్య ఉపకేంద్రాన్ని సందర్శించి ఫ్యామిలీ ఫిజిషియన్ వైద్య సేవలపై ఆరా తీశారు. కొరువాడ హైస్కూల్లో రెండవ దశలో నాడు–నేడు పనులను సత్వరం పూర్తి జరిగేలా చూడాలన్నారు. లంకవానిపాలెం పీహెచ్‌సీకి వెళ్లే మార్గంలో విద్యుత్ సౌకర్యం, ఆర్టీసీ బస్సులను నిలిపేలా స్టాప్‌ను ఏర్పాటు చేయాలని వైద్యాధికారిణి శైలజ కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ జె.రమేష్‌బాబు, ఎంపీడీవో కె.శచీదేవి, మండల ఇంజినీర్ బాలాజీ అప్పారావు, ఎంఈవో మధుమూర్తి, ఏవో సోమశేఖర్, ఈవోఆర్డీ ప్రసాద్, ఏఈలు చంద్రశేఖర్, బి.రవిబాబు పాల్గొన్నారు.

బాధ్యతగా పని చేయకపోతే ఇంటికి పంపిస్తా

- సిబ్బందికి నర్సీపట్నం ఆర్డీవో హెచ్చరిక



సిబ్బందికి సూచనలు చేస్తున్న ఆర్డీవో జయరామ్

నాతవరం: ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగా పని చేయని వారిని ఇంటికి పంపిస్తామని నర్సీపట్నం ఆర్డీవో హనుమంత వెంకట జయరామ్ అన్నారు. ఆయన మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం అత్యవసర సమావేశం నిర్వహించారు.. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగనన్న భూ రీ సర్వే విషయంలో కొంతమంది సిబ్బంది బాధ్యతారహితంగా పని చేస్తున్నారని, వారిలో మార్పు రాకపోతే చర్యలు తీసుకుంటామన్నారు. పని చేయని వారి జాబితా తన వద్ద ఉందని రీ సర్వే చేసేటప్పుడు నిబంధనలు విధిగా పాటించాలని అన్నారు. రీ సర్వే చేసే గ్రామాల్లో ముందుగా రైతులకు సమాచారం ఇవ్వడంతో పాటు అవగాహన కల్పించాలన్నారు. ఇంతవరకు రీసర్వే చేసిన భూముల వివరాలు రేపట్నుంచి రీ సర్వే చేసే రెవెన్యూ గ్రామాలపై చర్చించారు. రీ సర్వేపై కలెక్టరు చాలా సీరియస్‌గా ఉన్నారని ఈ విషయంపై నిర్లక్ష్యం చేయరాదన్నారు. రీ సర్వేతో పాటు స్పందన ఫిర్యాదులపై యుద్ధ ప్రతిపాదికన స్పందించాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కనకరావు డిప్యూటీ తహసీల్దార్ చైన్లు, సర్వేయరు బాలరెడ్డి ఆర్ఐ నారాయణరావు, వీఆర్వోలు పాల్గొన్నారు.

తప్పిన భారీ ప్రమాదం



చెట్టును ఢీకొట్టి ఆగిన ట్రాలీ లారీ

మాకవరపాలెం: లారీ బ్రేకులు పట్టకపోవడంతో అదుపు తప్పింది. అన్‌రాక్ అల్యూమినియం రిఫైనరీకి విశాఖ నుంచి వస్తున్న ట్రాలీ లారీకి మండలంలోని భీమబోయినపాలెం వద్దకు వచ్చేసరికి బ్రేకులు పట్టలేదు. దీంతో ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించే క్రమంలో రోడ్డు పక్కనే ఉన్న తాడిచెట్టును ఢీకొట్టి ఆగింది. డ్రైవర్‌కు స్వల్పగాయాలయ్యాయని స్థానికులు తెలిపారు. ఏదైనా వాహనాన్ని ఢీకొట్టి ఉంటే భారీ ప్రమాదం జరిగేదని చెప్పారు. చెట్టును ఢీకొట్టి ఆగడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

శారదా నదిలో గల్లంతైన

యువకుల మృతదేహాలు లభ్యం



వెదురుపర్తి వద్ద శారదానది నుంచి వెలికి తీసిన పిల్లి అనిల్ మృతదేహం



పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను ఆస్పత్రికి తరలిస్తున్న ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది

కశింకోట: మండలంలోని వెదురుపర్తి వద్ద శారదా నదిలో గల్లంతైన ఇద్దరు యువకుల మృతదేహాలు మంగళవారం లభ్యమయ్యాయి. విశాఖ నుంచి వచ్చిన ఎన్‌డీఆర్ఎఫ్ బృందం మృతదేహాలను వెలికి తీసింది. వెదురుపర్తి వద్ద నదిలో స్నానానికి దిగి యలమంచిలి మండలం పోతిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన పిల్లి అనిల్ (14), నక్కపల్లి మండలం చందనాడకు చెందిన ఏడిద ప్రసాద్ (17) సోమవారం గల్లంతైన సంగతి తెలిసిందే. దీంతో స్థానిక ఈతగాళ్లు, అనకాపల్లి ఫైర్ సిబ్బందితో వెతికించినా వీరి మృతదేహాలు లభ్యం కాలేదు. ఈ నేపథ్యంలో విశాఖ నుంచి ఎన్‌డీఆర్ఎఫ్ బృందాన్ని రప్పించి గాలింపు నిర్వహించారు. దీంతో మునిగి పోయిన ప్రాంతంలోనే అనిల్, ప్రసాద్‌ల మృతదేహాలను గుర్తించి వెలికి తీశారు. వీటిని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. ఎస్ఐ ఎ.ఆదినారాయణరెడ్డి, అదనపు ఎస్ఐ జె.నాగేశ్వరరావు పర్యవేక్షించారు.

బావిలో పడిన వృద్ధుడిని కాపాడిన ఫైర్ సిబ్బంది



రక్షిస్తున్న అగ్నిమాపక సిబ్బంది



శేషుబాబు

రావికమతం: ప్రమాదవశాత్తు బావిలో పడిన ఒక వృద్ధుడిని రావికమతం అగ్నిమాపక సిబ్బంది సురక్షితంగా బయటికి తీసి కాపాడారు. రావికమతం సంతోషిమాత ఆలయం వద్ద మంగళవారం ఈ సంఘటన జరిగింది. ఆ గ్రామానికి చెందిన తలారి శేషబాబు (62) మద్యం మత్తులో గ్రామంలోని సంతోషిమాత ఆలయం వద్ద గల వరనుయ్యిలో ప్రమాదవశాత్తు జారి పడిపోయాడు. గట్టిగా కేకలు వేయడంతో స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందజేశారు. కేంద్రం ఇన్‌చార్జి పీఏ స్వామి, శివయ్యనాయుడు, సిబ్బంది హుటాహుటిన వచ్చి బావిలోకి దిగి అతన్ని సురక్షితంగా బయటికి తీశారు. శేషుబాబుతో పాటు అతని కుటుంబ సభ్యులు సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

అటవీ చెక్ పోస్టు నిర్వహణపై సిగపట్లు

నర్సీపట్నం : అటవీశాఖలోని అధికారుల మధ్య వార్ నడుస్తోంది. ఉమ్మడి జిల్లాలో నర్సీపట్నం అటవీ డివిజన్ చాలా పెద్దది. జిల్లాల పునర్విభజన తర్వాత నర్సీపట్నం అటవీ డివిజన్ రెండుగా చీలిపోయింది. అల్లూరి సీతారామరాజు జిల్లాలో చింతపల్లి డివిజన్ కొత్తగా ఏర్పడింది. నర్సీపట్నం డివిజన్ అనకాపల్లి జిల్లాలో చేరింది. ఏజెన్సీ నుండి వచ్చే అక్రమ కలప రవాణాను నిరోధించేందుకు ఉమ్మడి జిల్లాలో ఏజెన్సీ ముఖద్వారమైన మర్రిపాలెంలో అటవీ చెక్ పోస్టును ఏర్పాటు చేశారు. జిల్లా పునర్విభజన జరిగినప్పటికీ చెక్‌పోస్టును నర్సీపట్నం డివిజన్‌కు కేటాయించారు. చెక్‌పోస్టు ఉన్న మర్రిపాలెం చింతపల్లి డివిజన్ పరిధిలోకి వస్తోంది. దీంతో చింతపల్లి, నర్సీపట్నం అటవీ అధికారుల మధ్య వార్ నడుస్తోంది. తమ ప్రాంతంలో ఉన్న చెక్‌పోస్టుపై నర్సీపట్నం అధికారుల పెత్తనంపై చింతపల్లి డీఎఫ్‌వో గుర్రుగా ఉన్నట్టు తెలిసింది. చెక్‌పోస్టు నర్సీపట్నం డివిజన్‌కు కేటాయించటం వల్ల తమ సిబ్బంది పర్యవేక్షిస్తున్నారని నర్సీపట్నం డీఎఫ్‌వో పేర్కొంటున్నారు. దీంతో ఇద్దరు డీఎఫ్‌వోల మధ్య చెక్‌పోస్టు విషయమై వార్ నడుస్తోంది. వివాదం రోడ్డు ఎక్కడంతో మర్రిపాలెంలో చెక్‌పోస్టును నర్సీపట్నం డివిజన్ పరిధిలోకి మార్చేందుకు డీఎఫ్‌వో రాజారావు అటవీ సిబ్బందితో కలిసి మంగళవారం పరిశీలించినట్టు తెలిసింది. చెక్‌పోస్టు నిర్వహణపై చింతపల్లి, నర్సీపట్నం అటవీ అధికారులు సిగపట్లు పడుతున్నారు.

సివిల్స్ సాధనలో సామాజిక స్పృహ కీలకం

జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ



ర్యాంకర్‌ను సత్కరిస్తున్న ప్రముఖులు

దాబాగార్డెన్స్: సమాజంపై అవగాహన ఉంటే సర్వీస్‌లోకి వచ్చాక గొప్పగా సేవ చేయగలుగుతామని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ పేర్కొన్నారు. సివిల్స్ సాధనలో సామాజిక స్పృహ కీలకమన్నారు. మంగళవారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సివిల్స్‌కు ఎంపికైన అభ్యర్థుల అభినందన సభ నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న కమిషనర్ మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలపై సివిల్స్ కోసం ఒత్తిడి చేయడం సరికాదన్నారు. వారి ఇష్టాలను ప్రోత్సహించాలన్నారు. సివిల్స్ సాధనకు ఢిల్లీ, హైదరాబాద్ సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. సరైన మార్గనిర్దేశం ఉంటే ఎక్కడి నుంచైనా సిద్ధం కావచ్చన్నారు. సిటీ లా అండ్ ఆర్డర్ డీసీపీ వి.విద్యాసాగర్ నాయుడు మాట్లాడుతూ సివిల్స్ ఎంపిక కావాలంటే టాపర్స్ అవ్వాల్సిన పని లేదన్నారు. సాధించాలనే సంకల్పం, కచ్చితమైన ప్రణాళికతో శ్రమిస్తే ఏమైనా సాధించవచ్చన్నారు. అల్లూరి విజ్ఞాన కేంద్రం కార్యదర్శి డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ యువతకు నాణ్యమైన విద్య అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. అన్ని పోటీ పరీక్షలకు కోచింగ్ ఇస్తున్నామని తెలిపారు. అనంతరం 2023 సివిల్స్‌లో విజేతలుగా నిలిచిన విశాఖకు చెందిన 243వ ర్యాంకర్ కె.సాహిత్య, 469వ ర్యాంకర్ బొడ్డు హేమంత్‌ను సన్మానించారు. అనివార్య కారణాలతో కార్యక్రమానికి రాలేకపోయిన 353వ ర్యాంకర్ ఎస్.ఆశ్రిత ఆడియో సందేశం పంపారు. కార్యక్రమంలో అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం సాంస్కృతిక సమన్వయకర్త జీఎస్ రాజేశ్వరరావు, అల్లూరి స్టడీ సర్కిల్ డైరెక్టర్ అభిమన్యు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మోదీ పాలనలో విప్లవాత్మక మార్పులు

- అగ్రరాజ్యాల చెంతకు భారత్
- బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సుహాసినీ ఆనంద్



విలేకరులతో మాట్లాడుతున్న సుహాసినీ ఆనంద్

అనకాపల్లి టౌన్: ప్రధాని నరేంద్ర మోదీ తొమ్మిదేళ్ల పాలనలో దేశంలో అనేక విప్లవాత్మకమైన మార్పులు వచ్చాయని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సుహాసినీ ఆనంద్ అన్నారు. స్థానిక చదువులవారి వీధిలో పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ప్రజల కోసం మోదీ అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని, వీటిని వివరించేందుకు జూన్ 30 వరకూ ఇంటింటికీ బీజేపీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆమె చెప్పారు. రైల్వే వ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పులను తీసుకుని వచ్చారని, వందేభారత్ వంటి రైళ్లను నడపడం ద్వారా ప్రజల ప్రయాణ సమయాన్ని తగ్గించడం జరిగిందన్నారు. జమ్ము–కశ్మీర్‌లో ఫైబర్ నెట్‌వర్క్ ద్వారా కేబుల్ బ్రిడ్జి నిర్మాణం జరిగిందని ఆమె తెలిపారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఈర్లె శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ కరోనా వంటి విపత్తు సమయంలో దేశంలో కరోన వ్యాక్సిన్ తయారు చేయించి ఇతర దేశాలకు అందజేసిన ఘనత భారతదేశానికే దక్కిందన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు ద్వారపరెడ్డి పరమేశ్వరరావు, పార్టీ జిల్లా ఇన్‌చార్జి ఎలిమిరెడ్డి మాలకొండయ్య పాల్గొన్నారు.

ఆహా.. 'అరకు కాఫీ'

అరకు కాఫీకి అంతర్జాతీయంగా క్రేజ్ పెరుగుతోంది. ముఖ్యంగా సేంద్రియ పద్ధతుల్లో సాగుచేస్తున్న కాఫీ ఘుమఘుమలకు విదేశీయులు ఫిదా అవుతున్నారు. ఏజెన్సీలో గిరిపుత్రులు పండిస్తున్న కాఫీని ప్రైవేటు సంస్థలు ప్రస్తుతం ఎగుమతి చేస్తున్నాయి. అయితే.. ఇకపై సొంతంగా ఇతర దేశాలకు ఎగుమతి చేసేందుకు గిరిజన సహకార సంస్థ (జీసీసీ) ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.

- అంతర్జాతీయంగా డిమాండ్
- ఏజెన్సీలో సేంద్రియ పద్ధతుల్లో కాఫీ సాగు
- ఇప్పటికే అరకు కాఫీకి ఎన్‌పీవోపీ ఆర్గానిక్ సర్టిఫికేషన్
- ప్రస్తుతం ప్రైవేట్ సంస్థల ద్వారా విదేశాలకు ఎగుమతి
- సొంతంగా ఎగుమతి చేసేందుకు జీసీసీ ప్రణాళికలు

సాక్షి, విశాఖపట్నం : అల్లూరి సీతారామరాజు జిల్లాలోని అరకు ప్రాంతంలో పండే కాఫీకి దేశీయంగానే కాకుండా అంతర్జాతీయంగానూ మొదటి నుంచీ మంచి డిమాండ్ ఉంది. మన కాఫీ బ్రాండ్‌ను అరకు కాఫీ పేరుతో విదేశీ మార్కెట్‌లో మరింత సుస్థిరం చేస్తోంది. జపాన్‌లోనే కాకుండా.. బ్రెజిల్, అమెరికా.. తదితర దేశాల్లో అరకు కాఫీ అంటే ఆహా అనేవారు చాలా మంది ఉన్నారు. అత్యధికంగా కాఫీ తోటలను సాగు చేసే బ్రెజిల్‌తో పాటు మన దేశంలోని కర్ణాటకలో ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోయింది. ఈ అవకాశాన్ని అందిపుచ్చుకున్న అరకు కాఫీ.. అంతర్జాతీయ మార్కెట్‌లో తనదైన ముద్రవేసుకుంది. విశాఖ ఏజెన్సీ ప్రాంతంలో సేంద్రియ పద్ధతుల్లో సాగుచేస్తున్న అరబికా, రోబస్టా చెర్రీ కాఫీ రకాలకు రానురాను మార్కెట్ పెరుగుతోంది. అల్లూరి జిల్లాలో ప్రస్తుతానికి రెండు క్లస్టర్లలో 2,258.55 హెక్టార్ల విస్తీర్ణంలో ఆర్గానిక్ పద్ధతుల్లో కాఫీని పండిస్తున్నారు. చింతపల్లి క్లస్టర్ వరుసగా మూడో ఏడాది నేషనల్ ప్రోగ్రామ్ ఫర్ ఆర్గానిక్ ప్రొడక్షన్ (ఎన్‌పీవోపీ) స్టాండర్స్ సర్టిఫికెట్ తీసుకోగా.. జీకేవీధి క్లస్టర్ ఇప్పటికే రెండుసార్లు స్కోప్ సర్టిఫికెట్ దక్కించుకుంది. మూడో ఏడాదీ సేంద్రియ సాగుకు సంబంధించి స్కోప్ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకుంది.



సొంతంగా విదేశాలకు ఎగుమతి కోసం...

అరకులో సేంద్రియ పద్ధతిలో సాగు చేస్తున్న కాఫీ గింజల్ని బెంగళూరుకు చెందిన అనేక ప్రైవేట్ సంస్థలు సేకరిస్తున్నాయి. బ్రెజిల్, జపాన్, యూఎస్‌తో పాటు ఇతర దేశాలకు ఎగుమతి చేస్తున్నారు. అయితే.. జీసీసీ సొంత బ్రాండ్‌తో దేశీయ మార్కెట్‌లో మాత్రమే కాఫీని విక్రయిస్తోంది. విదేశీ విపణిలో పెరుగుతున్న డిమాండ్‌ని దృష్టిలో పెట్టుకుని ఇకపై సొంతంగా ఎగుమతులు చేపట్టాలని జీసీసీ భావిస్తోంది.

ఆర్గానిక్ కాఫీ సాగు ఇలా..

చింతపల్లి క్లస్టర్...

గ్రామాలు	సాగు చేస్తున్న రైతులు	సాగు విస్తీర్ణం (హెక్టార్లలో)
గొందిపాకల	500	362.50
లంబసింగి	500	334.00
కప్పాలు	300	188.05
మొత్తం	1300	884.55

జీకేవీధి క్లస్టర్‌లో..

గ్రామాలు	సాగు చేస్తున్న రైతులు	సాగు విస్తీర్ణం (హెక్టార్లలో)
జీకేవీధి	500	480.00
పెదవలస	500	630.00
యర్రచెరువు	300	264.00
మొత్తం	1300	1374.00

ఎన్‌వోపీ సర్టిఫికెట్ కోసం యత్నం



అల్లూరి జిల్లాలో అద్భుతమైన రుచి కలిగిన ఆర్గానిక్ కాఫీ ఉత్పత్తవుతోంది. ఆర్గానిక్ కాఫీని విదేశాలకు ఎగుమతి చేయాలంటే ప్రస్తుతం ఉన్న ఎన్‌పీవోపీ సర్టిఫికెట్ సరిపోదు. నేషనల్ ఆర్గానిక్ ప్రొడక్షన్ (ఎన్‌వోపీ) స్టాండర్స్ సర్టిఫికెట్ అవసరం. ఇందు కోసం ప్రయత్నిస్తున్నాం. – సురేష్‌కుమార్, జీసీసీ ఎండీ

ఆర్గానిక్ సాగు పెంచేందుకు కృషి



అరకులో సేంద్రియ కాఫీ సాగును మరింత పెంచేందుకు ప్రయత్నాలు చేస్తున్నాం. జీసీసీ నేరుగా విదేశాలకు ఎగుమతి చేస్తే.. ఇక్కడి రైతులు మరింత లాభాలు పొందే అవకాశం ఉంది. పార్చ్‌మెంట్ కాఫీకి కిలోకు రూ.285, చెర్రీకాఫీకి కిలోకు రూ.145 చొప్పున అందిస్తున్నాం.

– శోభా స్వాతిరాణి, జీసీసీ చైర్‌పర్సన్

క్లుప్తంగా

నూతన బ్రిడ్జిపై వేగ నియంత్రణకు చర్యలు



రోడ్డు ప్రమాదాలు నిర్మూలనకు నూతన బ్రిడ్జిపై రబ్బర్‌స్పీడ్ బ్రేకర్స్ ఏర్పాటు

అనకాపల్లిటౌన్ : స్థానిక శారదానది నూతన బ్రిడ్జిపై రోడ్డు ప్రమాదాలు జరగకుండా రబ్బర్ స్పీడ్ బ్రేకర్స్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని ట్రాఫిక్ సీఐ టి.శ్రీను మంగళవారం చెప్పారు. అనకాపల్లి మండలంలో గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణానికి వచ్చే వివిధ రకాలైన వాహనదారులు వారి వేగాన్ని నియంత్రించేందుకు, రాత్రి సమయంలో రోడ్డు ప్రమాదాలు నిర్మూలనకు ప్రత్యేక చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. బ్రిడ్జి సమీపంలో నలుగురు రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడ్డారని, ప్రజలు కోరిక మేరకు రబ్బర్ స్పీడ్ బ్రేకర్స్‌ను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ జె.రమేష్, జాతీయ రహదారి సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల్లో 686 మంది గైర్హాజరు

అనకాపల్లిటౌన్: ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించినట్టు జిల్లా ఇంటర్మీడియట్ అధికారిణి సుజాత మంగళవారం చెప్పారు. మొదటి సంవత్సరం పరీక్షకు 5,986 మంది విద్యార్థులకు గాను 5,565మంది పరీక్షలు రాయగా 421 మంది గైర్హాజరైనట్టు ఆమె చెప్పారు. ద్వితీయ సంవత్సర పరీక్షల్లో 2,478 మంది విద్యార్థులకు గాను 2,213 మంది పరీక్షలు రాయగా 265 మంది గైర్హాజరైనట్టు తెలిపారు.

తగ్గని సూర్యతాపం



కశింకోటలో బోసిపోయిన ప్రధాన పంచాయతీ రహదారి

కశింకోట : మండల ప్రజలు సూర్య తాపంతో మంగళవారం సతమతమయ్యారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఉష్ణోగ్రత ఎక్కువగా ఉండడంతోపాటు చిన్నగా వడ గాడ్పులు కూడా వీచాయి. దీంతో ప్రజలు విలవిలలాడారు. ఇళ్ల నుంచి బయటకు రావడానికి సాహించలేదు. అత్యవసర పనులు ఉన్న వారు తప్ప అత్యధిక మంది ఇళ్లకే పరిమితమయ్యారు. దీంతో కశింకోటలోని ప్రధాన వీధులు జన సంచారం లేక బోసిపోయాయి. సాయంత్రం ఆకాశంలో మేఘం వేసి వాతావరణం చల్లబడడంతో ప్రజలు కాస్త ఉపశమనం చెందారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు మంగళవారం 331 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	--	--
రెండో రకం	3,930	4,500
మూడో రకం	3,650	3,700

అనకాపల్లి సినిమాలు

కస్టడీ	- రాజా
రామబాణం	-సత్యనారాయణ-1
అన్నీమంచి శకునములే	-సత్యనారాయణ స్క్రీన్-2
కేరళ	-షిర్డిసాయి
విరూపాక్ష	-పర్తిసాయి
ఫాస్ట్ అండ్ ఫ్యూరియస్10	-వెంకటేశ్వర
ఉగ్రం	-శ్రీసత్య
బిచ్చగాడు-2	- రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 39 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-5 యూనిట్లు, బీ పాజిటివ్-4 యూనిట్లు, ఒ పాజిటివ్-30 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా మంగళవారం 367 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారికి 285 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ (ఫోన్‌నంబర్9441108144)ని సంప్రదించవచ్చు.

వచ్చే ఎన్నికల్లో మళ్లీ జగనన్నదే అధికారం



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా దిలీప్‌కుమార్‌కు కేక్‌ను తినిపిస్తున్న పార్టీ జిల్లా అధికార ప్రతినిధి బుల్లిబాబు

అనకాపల్లిటౌన్ : ప్రజా సంకల్ప యాత్రంలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు సమస్యలు తెలుసుకుని ఎన్నికల మ్యానిఫెస్టోలో (నవరత్రాలు) ఇచ్చిన వాగ్దానం మేరకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన వెంటనే మొదటి సంతకం పెట్టి అమలు చేసిన ఘనత ప్రభుత్వానికే దక్కిందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్ అన్నారు. స్థానిక రింగ్‌రోడ్డు పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఏర్పాడి నాలుగేళ్లు పూర్తయి, ఐదో సంవత్సరంలో అడుగుపెడుతున్న సందర్భంగా మంగళవారం కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో ఆయన మాట్లాడారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో ప్రజల దీవెనలతో ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి గెలుపొందడం ఖాయమన్నారు. దివంగత రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకరణ చేసే సమయంలో రాష్ట్ర రైతులను దృష్టిలో పెట్టుకుని ఉచిత విద్యుత్‌కు మొదటి సంతకం పెడితే, ప్రజల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నవరత్రాలపై సంతకం చేసినట్టు తెలిపారు. అవ్వాతాతలకు ప్రభుత్వ ఫించన్లు, అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వారి వారి స్వగృహాల వద్దకే వలంటీర్ వ్యవస్థ ద్వారా సకాలంలో అందించిన ఘనత దేశ చరిత్రలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కిందన్నారు. 14 సంవత్సరాలు చంద్రబాబుకు గుర్తుకురాని సంక్షేమ పథకాలు మహానాడులో కొత్త కొత్త సంక్షేమ పథకాలు అమలు చేస్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అమరావతిలో నివసిస్తున్న బడుగు, బలహీన వర్గాల ప్రజలకు గృహాలు అందిస్తుంటే టీడీపీ నేతలు రైతుల ముసుగుల్లో సుప్రీంకోర్టును ఆశ్రయించగా కోర్టు టీడీపీ నేతలకు మంచి బుద్ధి చెప్పిందన్నారు. సీఎం జగన్ 1,402 ఎకరాల్లో 50,793 మంది అమరావతిలో నివసిస్తున్న నిరుపేదలకు గృహాలు నిర్మించుకునేందుకు జగనన్న గృహపట్టాలను అందజేసినట్టు చెప్పారు. పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో అనకాపల్లి ఎమ్మెల్యేగా గుడివాడ అమర్‌నాథ్‌ను మరోసారి గెలిపించుకునే బాధ్యత నియోజకవర్గ ప్రజలపై ఉందన్నారు. ఎంపీపీ గొర్లి సూరిబాబు మాట్లాడుతూ టీడీపీ నాయకులు కల్లబొల్లి మాటలతో ప్రజలను నమ్మించి అధికారం కోసం ఎదురుచూస్తున్నారని, రానున్న ఎన్నికల్లో ప్రజలే మరోసారి టీడీపీకి బుద్ధి చెబుతారని అన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ భీశెట్టి వరహ సత్యవతి, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు శిలపరశెట్టి శివ వెంకట సత్యనారాయణ(జోషఫ్), పట్టణ సచివాలయాల కన్వీనర్ కొణతాల మురళీకృష్ణ, కశింకోట జెడ్పీటీసీ దంతులూరి శ్రీధర్‌రాజు, గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేడ శివ, పట్టణ మహిళా విభాగం అధ్యక్షురాలు రత్నకుమారి, పార్టీ పట్టణ అధికార ప్రతినిధి నాగేశ్వరరావు, కశింకోట సర్పంచ్ గున్నయ్యనాయుడు, తుమ్మపాల సర్పంచ్ పెంటయ్యనాయుడు, పార్టీ నాయకులు పలకా సత్యనారాయణ, గైపూర్ రాజు, సత్యనారాయణ, ఉగ్గిన అప్పారావు పాల్గొన్నారు.

యువత చలివేంద్రాలను ఏర్పాటు చేయాలి



మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న డైరెక్టర్ గీతాంజలి

అనకాపల్లిటౌన్: వేసవిలో బాటసారుల దాహార్తిని తీర్చి ఉపశమనం కలిగించేందుకు ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా మజ్జిగ చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని రాష్ట్ర చాత్తాద శ్రీవైష్ణవ కార్పొరేషన్ డైరెక్టర్ తొండ గీతాంజలి అన్నారు. గవరపాలెం నూకాంబిక అమ్మవారి ఆలయ సమీపంలో ఆలయానికి వచ్చే భక్తులకు ఉచితంగా మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం ఆమె ప్రారంభించారు. ప్రతి ఏటా వేసవి కాలంలో ప్రభుత్వం ఉచిత తాగు నీటి చలివేంద్రాలను జనసంచార ప్రదేశాల్లో ఏర్పాటు చేస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. కార్పొరేషన్ ఆధ్వర్యంలో 1400 మందికి ఉచితంగా మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో భాగవతుల చాత్తాద శ్రీవైష్ణవ సేవా సంఘం జిల్లా నాయకులు నారాయణమూర్తి, ఉదయ్‌కుమార్, ఈశ్వరరావు, ప్రియ, నాగమణి పాల్గొన్నారు.

కొంకి అప్పారావుకు ఎంపీడీవోగా పదోన్నతి

కశింకోట: పూర్తిస్థాయి ఇన్‌ఛార్జి ఎంపీడీవోగా పని చేసిన కొంకి అప్పారావుకు ఎంపీడీవోగా పదోన్నతి లభించింది. ఈ మేరకు కాకినాడ జిల్లాకు బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన ఆనందపురం నుంచి ఇక్కడకు బదిలీపై గత ఏడాది వచ్చి బాధ్యతలు చేపట్టారు. సమర్థంగా బాధ్యతలు నిర్వహిస్తూ అనతి కాలంలోనే అందరి మన్ననలు పొందారు. ప్రస్తుతం తాత్కాలిక ఇన్‌ఛార్జిగా ఏవో ఎ.ఎ.ఖాన్ వ్యవహరించనున్నారు.

అభివృద్ధి పనులపై సమీక్ష

అనకాపల్లి రూరల్ : మండలంలో జరుగుతున్న బలహీనవర్గాల గృహ నిర్మాణం, అంగన్‌వాడీ భవనాల మరమ్మతులు, జగనన్న కాలనీల్లో అంతర్గత రహదారుల నిర్మాణం, తాగునీటి సరఫరా తదితర అంశాలపై మంగళవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో సమీక్ష సమావేశం జరిగింది. పలు గ్రామాల సర్పంచ్‌లు,ఎంపీటీసీలతో ఎంపీపీ గొర్లి సూరిబాబు, ఎంపీడీవో కె ధర్మారావు,పలు శాఖల అధికారులు చర్చించారు. ఆయా గ్రామాల్లో జరుగుతున్న జగనన్న లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలు చేపట్టకపోతే వారికిచ్చిన స్థలాల పట్టాలు రద్దు చేసి ఇళ్ల నిర్మించుకునేవారికి ఇస్తే మంచిదన్న అభిప్రాయాన్ని కొందరు వ్యక్తపరిచారు.అంగన్‌వాడీ కేంద్రాల మరమ్మతు పనుల కోసం మండల పరిషత్ వద్ద సుమారు రూ.1.30 కోట్ల నిధులు న్నాయని అవసరమైన వారు పనులు చేపడితే నిధులు మంజూరయ్యేలా చూస్తామని ఎంపీపీ సమావేశంలో చెప్పారు. పంచాయతీరాజ్ డిఈఈ వేణుగోపాల్,హౌసింగ్ డిఈఈ మధురవాణి, మండల ఇంజినీరింగ్ అధికారి కుమార్ రాజా,ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శ్రీనివాస్, ఐసీడీఎస్ అధికారులు పాల్గొన్నారు.

రాజ్యాంగంపై విద్యార్థులకు అవగాహన



భారత రాజ్యాంగంపై అవగాహన కలిగిస్తున్న రిటైర్డు ఎంఈవో నంబా రమణ

కశింకోట : కశింకోటలోని శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మంగళవారం భారత రాజ్యాంగంపై రిటైర్డు ఎంఈవో నంబా రమణ విద్యార్థులకు సమగ్ర అవగాహన కలిగించారు. రాజ్యాంగం గురించి, పౌరుల హక్కులు, బాధ్యతల గురించి వివరించారు. గ్రంథాలయ అధికారి కె.వరలక్ష్మి కార్యక్రమంలో పాల్గొన్నారు.

రోగులకు ఉచిత ఆయుర్వేద చికిత్సలు



ఆయుర్వేదపై విద్యార్థులకు ఆవాసన కార్యక్రమం కల్పిస్తున్న ప్రేమానంద్

అనకాపల్లి టౌన్ : ఆయుర్వేదలో వివిధ రకాలైన వ్యాధులకు ఉచితంగా చికిత్సలు అందిస్తున్నట్లు విశ్వ ఆయుర్వేద పరిషత్ జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ ప్రేమానంద్ అన్నారు. మండలంలో కోడూరు గ్రామంలో పరిషత్, ఆరోగ్య ధాత్రి ఆయుర్వేద పరిశోధనా సంస్థ ఆధ్వర్యంలో ఐదు రోజుల పాటు విద్యార్థులకు ఆయుర్వేద కౌశలం ఆవాస కార్యక్రమాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, ఒరిస్సా రాష్ట్రాల నుంచి విద్యార్థులు పాల్గొన్నట్టు తెలిపారు. వైద్య అనుభవ జ్ఞానం అందించడానికి దేశం నలుమూలలా నుంచి అనుభవజ్ఞులైన వైద్యులు విచ్చేశారన్నారు. శిక్షణలో భాగంగా ఎంతో మంది రోగులకు ఉచితంగా ఆయుర్వేద పంచకర్మ చికిత్సలు అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు సింహాచలం నాయుడు, సురేష్, మాధవరావు చౌదరి, కోటేశ్వరరావు, సుందరరాజు పెరుమాళ్, పాల్గొన్నారు.

వరాహలక్ష్మీ నృసింహస్వామి చందనం అరగదీత

అనకాపల్లిటౌన్: గవరపాలెం దిబ్బవీధిలో శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి వారి మూడో విడత చందన కైంకర్యం(చందనం అరగదీత) కార్యక్రమం బుధవారం నుంచి జూన్ 3వ తేదీ వరకూ నిర్వహిస్తున్నట్టు ఆలయ ప్రతినిధి కోరిబిలి పరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 4వ తేదీన జేష్ఠ పౌర్ణమి శుభ సందర్భంగా స్వామివారికి మూడో విడత చందన సమర్పణ ఉంటుందన్నారు.

బ్యాంకుల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి

నక్కపల్లి: బ్యాంకుల వద్ద, పలు ప్రాంతాల్లో చోరీలు జరుగుతున్న నేపథ్యంలో పటిష్టమైన రక్షణ చర్యలు చేపట్టాలని నక్కపల్లి సీఐ నారాయణరావు సూచించారు. మంగళవారం ఆయన నక్కపల్లి మండలంలో ఉన్న పలు బ్యాంకర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొంతమంది ముఠాగా ఏర్పడి పక్కా ప్రణాళికలతో చోరీలకు పాల్పడుతున్నట్టు తమకు సమాచారం ఉందన్నారు. బ్యాంకుల వద్ద, ఏటీఎంల వద్ద వీరు ప్రత్యేక దృష్టి సారించారని, బ్యాంకుల నుంచి నగదు డ్రా చేసే వారిపై దృష్టి కేంద్రీకరించి చోరీలకు పాల్పడుతున్నారన్నారు. సెలవుల కారణంగా దూర ప్రాంతాలకు వెళ్లిన వారి ఇళ్లపై కూడా ఈ ముఠాలు రెక్కీలు పెడుతున్నారన్నారు. బ్యాంకుల వద్ద ఏటీఎంల వద్ద క్వాలిటీతో కూడిన సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. సెక్యూరిటీ గార్డులను నియమించాలన్నారు. రేయింబవళ్లు చోరీలపై అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. అనుమానితులు కనిపించినా, వారి నడవడికలపై అనుమానం వచ్చినా వెంటనే సమీపంలో ఉన్న పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. దూరప్రాంతాలకు వెళ్లే వారు తమ ఇళ్లల్లో విలువైన బంగారు ఆభరణాలు ఇతర వస్తువులను జాగ్రత్తగా ఉంచుకోవాలని, లాకర్లలో భద్రపరుచుకోవాలన్నారు. పోలీసులకు ముందస్తు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు మేనేజరు, ఎస్ఐ శిరీష పాల్గొన్నారు.

విష్ణు సహస్రనామ పారాయణ శిక్షణ తరగతులు

అనకాపల్లిటౌన్ : దేమునిగుమ్మం శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో బుధవారం నుంచి జూన్ 8వ తేదీ వరకూ అన్నమాచార్య వాగ్గేయ వరదాయిని వారి ఆధ్వర్యంలో ఉచిత విష్ణు సహస్ర నామ పారాయణ శిక్షణ తరగతులు సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకూ నిర్వహిస్తున్నట్టు వాగ్గేయ వరదాయిని ఆర్గనైజింగ్ కమిటీ ప్రతినిధి కేశవరపు గోదాదేవి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి ఏడాది పిల్లలు, పెద్దలకు విష్ణు సహస్ర నామ పారాయణపై శిక్షణ నిర్వహిస్తున్నట్టు ఆమె తెలిపారు. ఎంతో పవిత్రమైన విష్ణు సహస్ర నామ పారాయణ నేర్చుకుని భావితరాల ప్రజలకు అందజేస్తారని ఆమె తెలిపారు.

పుస్తక సమీక్షలపై అవగాహన

పాయకరావుపేట : వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మంగళవారం పాయకరావుపేట శాఖా గ్రంథాలయంలో పలు పాఠశాలల విద్యార్థులకు గ్రంథాలయాధికారి వామాల లక్ష్మణరావు ఆధ్వర్యంలో పుస్తక సమీక్షలపై అవగాహన తరగతులను నిర్వహించారు. తెలుగు ఉపాధ్యాయుడు ఎన్. వి.ఎస్. ఆచార్యులు ఈ కార్యక్రమంలో పాల్గొని చిన్నారులకు పుస్తక పఠనం ఆవశ్యకతను ముందుగా వారికి తెలియజేశారు. కథ, దేశ నాయకులు, మ్యాగ్‌జైన్ వంటి ఒక అంశాన్ని చదివి రెండు పేజీలకు మించకుండా ఒక పేజీ తగ్గకుండా సమీక్షలు రాయడం అలవాటు చేసుకోవాలన్నారు. దీనివల్ల ఏ అంశాన్నైనా సొంత మాటల్లో వ్యక్తీకరించే సామర్థ్యం పెరుగుతుందన్నారు.

మహిళ అదృశ్యంపై ఫిర్యాదు

అనకాపల్లిటౌన్ : మండలంలో మామిడిపాలెం గ్రామానికి చెందిన మహిళ సోమవారం మధ్యాహ్నం అదృశ్యమైనట్టు రూరల్ పోలీసులకు మంగళవారం ఫిర్యాదు అందింది. యువతి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ నరసింగరావు చెప్పారు.

ధ్యానవేంకటేశ్వరస్వామి కల్యాణానికి సన్నాహాలు



కశింకోట: కశింకోటలోని శివాలయం వద్ద వెలసి ఉన్న ధ్యాన వేంకటేశ్వరస్వామి వార్షిక కల్యాణోత్సవాన్ని బుధవారం నిర్వహించడానికి సన్నాహాలు చేశారు. జేష్ఠ మాసం శుక్ల పక్ష ఏకాదశిన నిర్వహించనున్న కల్యాణోత్సవం పురస్కరించుకొని ఉదయం 8 గంటలకు విష్వక్సేన పూజ, భగవత్ పుణ్యాహవాచనం, రక్షా సూత్ర బంధన, దీక్షా ధారణ కార్యక్రమాలతో ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. 9 గంటలకు స్వామికి అభిషేకం, విశేష అర్చన జరుగుతాయన్నారు. ఏపీ అర్చక ఎగ్జామినర్ రేజేటి శ్రీరామాచార్యులు ఆధ్వర్యంలో సాయంత్రం 6 గంటలు శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలకు శాస్త్రోక్తంగా వేద మంత్రాల నడుమ కల్యాణోత్సవం జరగనుందన్నారు. రెండో రోజు గురువారం సాయంత్రం 6 గంటలకు శ్రీవారి గరుడోత్సవం తిరువీధుల్లో జరగనుందన్నారు. దీంతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు. రేజేటి సీతా రామాచార్యులు, రేజేటి గోప అప్పలాచార్యులు(చక్రవర్తి), రేజేటి మారుతి వెంకటాచార్యులు(మారుతి)ల పర్యవేక్షణలో కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

ఘనంగా గజ్జాలమ్మతల్లి పండగ



అమ్మవారికి పూలతో అలంకరించి పూజలు



కొత్తపల్లిలో అమ్మవారిని దర్శించుకుంటున్న వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం ఉత్తరాంధ్ర కార్యదర్శి విజయలక్ష్మి

కశింకోట : మండలంలోని కొత్తపల్లి గ్రామంలో మంగళవారం గజ్జాలమ్మ తల్లి పండగ ఘనంగా జరిగింది. ఈసందర్భంగా ఆలయంలో ప్రతిమల రూపం, వేప చెట్టు రూపంలో వెలసి ఉన్న అమ్మవారిని భక్తులు ఎక్కువ సంఖ్యలో అమ్మ వారిని దర్శించి పూజలు చేశారు. మొక్కుబడులు తీర్చుకున్నారు. వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం ఉత్తరాంధ్ర కార్యదర్శి విజయలక్ష్మి, ఎంపీపీ కలగా లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అనకాపల్లి కార్యదర్శి భీశెట్టి జగన్, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్ సీపీ శ్రేణులు, అధికారులు, సచివాలయ సిబ్బంది అమ్మవారిని దర్శించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు అద్దెపల్లి శ్రీనివాసరావు, సర్పంచ్ శ్యాంలు వారికి సాదరంగా స్వాగతం పలికారు. మధ్యాహ్నం అన్న సమారాధన జరిపారు.

కార్మిక సంక్షేమమే సీఐటీయూ ధ్యేయం



సీఐటీయూ కార్యాలయం వద్ద జెండా ఎగురవేస్తున్న జిల్లా అధ్యక్షుడు రుత్తల శంకర్రావు



కశింకోటలో సీఐటీయూ ఆధ్వర్యంలో అరుణ పతాకం ఆవిష్కరణ

అనకాపల్లి రూరల్: కార్మిక, కర్షక వర్గాల సంక్షేమమే సీఐటీయూ ధ్యేయమని, ఆవిర్భావం నుంచి వారి సమస్యల పరిష్కారమే ప్రధాన ఎజెండాగా పార్టీ పని చేస్తోందని జిల్లా అధ్యక్షుడు రుత్తల శంకర్రావు అన్నారు. సీఐటీయు 52వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా అనకాపల్లి కార్యాలయంలో పార్టీ జెండా ఎగురవేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలో కార్మిక వర్గాల గురించి అలుపెరగని పోరాటాలు చేసి వారికి న్యాయం చేయడంలో సీఐటీయూ ముందుంటుందన్నారు.సీఐటీయు జిల్ల నాయకుడు కె.లోకనాథం మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కార్మికులకు తీరని అన్యాయం చేసేలా ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరించడానికి పూనుకోవడం దారుణమన్నారు. ప్రభుత్వ సంస్థలను చౌకగా కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టాలనుకుంటున్న బీజేపీకి భవిష్యత్తులో తగిన గుణపాఠం చెప్పే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని అభిప్రాయపడ్డారు. అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కోట్లాది మందికి నష్టం చేకూర్చేలా కేంద్ర ప్రభుత్వం చట్టాలు చేయడం దుర్మార్గమని పలువురు నేతలు ఆరోపించారు. కార్మికులంతా తమ హక్కుల సాధనకు అవసరమైతే ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని నేతలు పిలుపునిచ్చారు. కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎ. బాలకృష్ణ, ముఠా వర్కర్స్ యూనియన్ నాయకులు బి.రాజు, ఆశా కార్యకర్తల సంఘం జిల్లా నాయకురాలు సూర్యకళ, పంచాయతీ వర్కర్ల సంఘం నాయకుడు పి.చిన్నారావు, రాజు, రమణమ్మ పాల్గొన్నారు.

కశింకోట: కశింకోటలో సీఐటీయు ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఇక్కడ అరుణ పతాకాన్నిఎగుర వేశారు. సీఐటీయు జిల్లా నాయకుడు దాకారపు శ్రీనివాసరావు, పలు సంఘాల ప్రతినిధులు టి. తనుజ, డి.డి.వరలక్ష్మి, సత్యనారాయణ, గోపి, భవాని కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఐదుగురికి వైఎస్సార్ పెళ్లి కానుక అందజేత



వైఎస్సార్ పెళ్లి కానుకను అందజేస్తున్న జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు రమేష్

కోటవురట్ల: వైఎస్సార్ పెళ్లి కానుక పేదరికంలో ఉన్న అమ్మాయిలకు ఎంతగానో ఉపకరిస్తోందని జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు పైల రమేష్ అన్నారు. కె.వెంకటాపురంలో ఐదుగురు లబ్ధిదారులకు వైఎస్సార్ పెళ్లి కానుకను ఐదుగురు మంగళవారం అందజేశారు. రమేష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పేదలకు వివాహ సమయంలో ఆసరా కల్పించాలనే ఆశయంతో వైఎస్సార్ వివాహ కానుకను ప్రవేశపెట్టారన్నారు. ఈ పథకం ద్వారా ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు రూ.లక్ష సాయం, కులాంతర వివాహం చేసుకుంటే రూ.1.20 లక్షలు, బీసీలకు రూ.50 వేలు, కులాంతర వివాహానికి రూ.75 వేలు ఆర్థిక సాయంగా అందిస్తున్నారన్నారు. మన గ్రామంలో ఐదుగురికి వివాహ కానుక వచ్చినట్టు తెలిపారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ వివాహ సమయంలో ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

భూసార పరీక్షలతో ఎంతో మేలు



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త శ్రీహరి

మునగపాక : భూసార పరీక్షలకు అనుగుణంగా పంటల సాగు శ్రేయస్కరమని బీసీటీ-కేవీకే భూసార పరీక్ష శాస్త్రవేత్త శ్రీహరి అన్నారు. పల్లపు ఆనందపురంలో రైతులకు నేల ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. నేలలో ఎటువంటి పోషకాలు ఉన్నాయో తెలుసుకునేందుకు మట్టి పరీక్షలు చేయించుకోవాలన్నారు. భూమిలో ఎటువంటి పంటలు అనుకూలంగా ఉంటాయో తెలుసుకునే అవకాశం ఉందన్నారు బీసీటీ సామాజిక కార్యకర్త పి.ఎ.నాయుడు, నూకాంబిక రైతు క్లబ్ కన్వీనర్, కో-కన్వీనర్లు మోహనరావు, వీర సంతోష్, రైతు అల్లవరపు రమణబాబు పాల్గొన్నారు.

లాడ్జిలో హత్య కేసులో కఠిన చర్యలు తీసుకోవాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాణిక్యం

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం ఎస్‌కేఆర్ లాడ్జిలో మహిళను హత్య చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు మాణిక్యం డిమాండ్ చేశారు. మంగళవారం అచ్యుతాపురంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ లాడ్జిలో జరిగిన హత్యకు యాజమాన్యం కూడా బాధ్యత వహించాలని, ఎవరెవరు లాడ్జికు వస్తున్నారు, ఎవరు వెళ్తున్నారనే అంశంపై అవగాహన ఉండాలని ఆమె పేర్కొన్నారు.మహిళలకు రక్షణ కరువైందన్నారు.

సూర్యదేవుని సన్నిధిలో ఆధ్యాత్మిక వేడుకలు

- త్రిదండి చినజియ్యర్‌స్వామి రాక
- జూన్ 3న మహాలక్ష్మి సమేత వైకుంఠ నారాయణుల విగ్రహావిష్కరణ



ధ్వజస్తంభం



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న ఫంక్షన్ హాలు

అనకాపల్లిటౌన్ : రెండో అరసవిల్లిగా ప్రసిద్ధి గాంచిన గ్రేటర్ విశాఖ విలీన గ్రామమైన రాజుపాలెం సూర్యనారాయణస్వామి ఆలయం ఆధ్యాత్మిక వేడుకలకు ముస్తాబైంది. ఈనెల 31వ తేదీ నుంచి జూన్ 3వతేదీ వరకు పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించేందుకు ఆలయ కమిటీ చైర్మన్ కొణతాల బాబూరావు ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. పరమహంస పరివ్రాజకాచార్య పద్మభూషణ్ అవార్డు గ్రహీత త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజియ్యర్‌స్వామి చేతుల మీదుగా జరగనున్న ఈ కార్యక్రమానికి ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. జూన్ 3న 22 అడుగుల మహాలక్ష్మి సమేత వైకుంఠ నారాయణ స్వామి విగ్రహావిష్కరణ, వేంకటేశ్వరస్వామి లక్ష్మీనారాయణుల పాలరాతి విగ్రహాలు, ధ్వజస్తంభం ప్రతిష్టాపన మహోత్సవాలు జరగనున్నాయి. అవంతి ఆనంద నిలయం, శ్రీ పాలూరి సూర్యప్రకాశరావు ఫంక్షన్‌హాలు ప్రారంభం, స్వామివారి అనుగ్రహబాషణ, భారీ అన్నసమారాధన వంటి కార్యక్రమాలు జరగనున్నాయి. బుధవారం సాయంత్రం విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం, గురువారం ఉదయం యాగశాలపూజ, శోభాయాత్ర, అంకురారోపణం, అగ్నిప్రతిష్టాపన, చక్రాబ్జమండల రచన, హారతి తీర్థగోష్ఠి, సాయంత్రం యోగీశ్వర మండల ఆరాధన, మూర్తికుంభ ఆవాహన, గురుడపర ఆవాహన, జలాధివాసం, సుదర్శన, లక్ష్మీనారాయణ మూలమంత్ర హోమం కార్యక్రమాలు జరగనున్నాయి. శుక్రవారం ఉదయం జలాది ఉద్ధరణ, స్నపతి తిరుమంజనం, క్షీరాదివాసం, నిత్యహోమం, ధ్వజారోహణం, అష్ట దిక్పాలక ఆవాహన, తీర్థగోష్ఠి, సాయంత్రం హోమాలు నేత్రపర్వంగా జరగనున్నాయి.